
దేవస్థానం సిబ్బందితో ఆక్రమణదారుల వాగ్వాదం


ఈవోపై దాడికి యత్నిస్తున్న ఆక్రమణదారులు

ఆ రాముడే.. దిగిరావాలేమో!

రోజురోజుకు జటిలమవుతున్న ఆలయ భూముల వివాదం

అక్రమార్కుల చెర నుంచి తన భూములను కాపాడుకునేందుకు చివరకు ఆ భద్రాద్రి రాముడే దిగిరావాలేమో.. అన్నట్టుగా మారుతోంది పురుషోత్తపట్నంలో పరిస్థితి. అక్కడి దేవస్థాన భూముల్లో అక్రమ నిర్మాణాలను రోజురోజుకు పెరుగుతుండటం.. అడ్డుకునేందుకు వెళుతున్న ఆలయ అధికారులు, సిబ్బందిపై అక్కడివారు దాడులకు తెగబడుతుండటంతో సమస్య జటిలమవుతోంది. తాజా మంగళవారం అక్కడ జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన దేవస్థానం ఈవో, సిబ్బందిపై దౌర్జన్యానికి దిగడం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం రేపింది. ఈ దాడిలో భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి, కాంట్రాక్టుఉద్యోగి వినీల్ స్పృహ కోల్పోయారు. దీంతో వారిని భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

- పురుషోత్తపట్నం భూముల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు
- అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపై ఆక్రమణ దారుల దౌర్జన్యం
- దేవస్థానం ఈవో రమాదేవి, సిబ్బందిపై దాడి
- స్పృహ కోల్పోయిన ఈవో, ఉద్యోగి
- ఆరా తీస్తున్న తెలుగు రాష్ట్రాల పోలీసు నిఘా వర్గాలు
- ఘటనపై స్పందించిన మంత్రి కొండా సురేఖ
- ఆలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడతామంటూ హెచ్చరిక
- ఆస్పత్రిలో ఈవోకు ఎమ్మెల్యే, ఆర్డీవో పరామర్శ

భద్రాచలం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న తెలుసుకున్న దేవస్థానం అధికారులు సోమవారం అక్కడికి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్థానికులు సిబ్బందిపై దాడికి ప్రయత్నించటంతో వారు వెనుదిరిగారు. మళ్లీ రెండో రోజు మంగళవారం కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న విషయం తెలుసుకున్న దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి.. తమ సిబ్బందితో నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో 'నిర్మాణాలు ఆపేందుకు మీరెవరు?' అంటూ దేవస్థానం అధికారులు, సిబ్బందిని ఆక్రమణదారులు, స్థానికులు ప్రశ్నించారు. అందుకు ఈవో బదులిస్తూ.. 'ఈ భూములు భద్రాద్రి దేవస్థానానికి చెందినవి. మా వద్ద అన్ని రకాల పత్రాలు ఉన్నాయి' అని స్పష్టం చేశారు. దాంతో కోపోద్రిక్తులైన ఆక్రమణదారులు అధికారుల చేతుల్లో ఉన్న హక్కు పత్రాలను గుంజుకున్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా 'మా స్థలంలో నుంచి వెళ్లిపోండి' అంటూ అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్న స్థానికులు, ఆక్రమణదారులు దేవస్థానం అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా తోపులాటకు దారితీయగా.. ఆ సమయంలో కొందరు ఈవో రమాదేవిని లక్ష్యంగా చేసుకొని ఆమెపై దాడి చేశారు. దీంతో ఒక్కసారిగా ఈవో రమాదేవి స్పృహ కోల్పోవడంతో భద్రాచలంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఇదే ఘటనలో కాంట్రాక్టు ఉద్యోగి వినీల్ కూడా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆయన్ను కూడా అదే వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.


దేవాదాయ భూముల్లో అక్రమ నిర్మాణాలు

స్పందించని ఏపీ రెవెన్యూ, పోలీసు అధికారులు

భద్రాద్రి రామయ్యకు పురుషోత్తపట్నంలో 889.5 ఎకరాల భూమి ఉంది. ఇందులో 90 శాతం పైగా భూమి ఆక్రమణల్లోనే ఉంది. కాగా తాము రెండు రోజులుగా భూముల్లో అక్రమ నిర్మాణాలు అడ్డుకునేందుకు వెళ్లే సమయంలో యటపాక రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చినా సరైన రీతిలో స్పందించలేదని దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కేవలం ఒక్క హెడ్ కానిస్టేబుల్‌ను పంపారని వారు వాపోతున్నారు. ఈ విషయమై భద్రాచలం పోలీసు అధికారులు కూడా యటపాక పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారని అయినా యటపాక పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడంతోనే మంగళవారం దాడి జరిగిందని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి. 2019 నుంచి దేవస్థానం భూముల్లో ఆక్రమణలు అక్రమ నిర్మాణాల జోరు ఊపందుకుందని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఆక్రమణదారుల నుంచి దేవస్థానం అధికారులు అధికారికంగా రామయ్య భూములను సాగు చేస్తున్నందుకు నష్టపరిహారంగా (ఏజెన్సీ ప్రాంతం కావడంతో) నగదును (మిగతా 6వ పేజీలో)

కేసు నమోదు..

భద్రాద్రి ఈవో రమాదేవిపై పురుషోత్తపట్నం భూముల ఆక్రమణదారులు దాడి చేసిన ఘటనలపై ఏఈవో భవాని రామకృష్ణారావు యటపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి వారిపై కేసు నమోదు చేసినట్టు యటపాక సీఐ కన్నప్పరాజు తెలిపారు.

హలో.. వ్యవసాయాధికారి

నేడు రైతు సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్



వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. దుక్కులు దున్నడం మొదలు.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు, వాడకంతోపాటు పంటల సస్యరక్షణ, వాటికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. ఈసమస్యలను బుధవారం నిర్వహించే 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ ద్వారా ఖమ్మం జిల్లా వ్యవసాధికారి (జేడీఏ) డి.పుల్లయ్య దృష్టికి నేరుగా తీసుకెళ్లి పరిష్కరించుకోవవచ్చు. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే రైతు సంక్షేమ పథకాలు, రుణాల మంజూరులో ఉన్న అనుమానాలు, సాంకేతిక ఇబ్బందులను ఈ ఫోన్ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యవసాయాధికారికి విన్నవించుకోవచ్చు.

ఫోన్ ఇన్ తేదీ
9-7-2025 (బుధవారం)
సెల్ నెంబరు
99854 11613
కాల్ చేయాల్సిన సమయం
ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన మేయర్, కమిషనర్

వర్షాలు పడకముందే..

అభివృద్ధి, నిర్మాణ పనులు పూర్తి కావాలి

- ఖమ్మం 15వ డివిజన్ పర్యటనలో మంత్రి తుమ్మల
- పలు పనులకు శంకుస్థాపన.. స్థానికులతో మమేకం

ఖమ్మం కార్పొరేషన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో చేపట్టే అభివృద్ధి నిర్మాణ పనులు వర్షాలు పడకముందే పూర్తి చేయటం ద్వారా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని, పనులు వేగవంతంగా జరపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా ఖమ్మం నగరం అభివృద్ధి జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని కోరారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉండటంతో పాటుగా జాతీయ రహదారులు అనుసంధానం ఖమ్మం నుంచే (మిగతా 6వ పేజీలో)

ఉద్యానం.. అధ్వానం..

- నిర్వహణ లోపంతో కళావిహీనంగా సత్తుపల్లి జేవీఆర్ పార్కు
- అడవిని తలపిస్తున్న పార్కు.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- బాగోగులు మరిచిన మునిసిపాలిటీ 6


జేవీఆర్ పార్కు ముఖ ద్వారం

ఖమ్మం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా శంకర్

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నరేందర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా టి.శంకర్ నియమితులయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా మెడికల్ కళాశాలలో ఈఎన్టీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఖమ్మం కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ వైద్యఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానా జడ్ చోంగ్తు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఖమ్మం కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన డాక్టర్ రాజేశ్వరరావు మైక్రో బయాలజీ హెచ్‌వోడీగా కొనసాగనున్నారు. అయితే మెడికల్ కళాశాల మంజూరైనప్పటి నుంచి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజేశ్వరరావు సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఆయన కళాశాలను అబివృద్ధికి కృషి చేయంతో పాటు నిర్వహణను సమర్థవంతగా నిర్వహించగలిగారు. ఇక మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ఉన్న జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం.నరేందర్‌ను నియమించారు. ఆయన వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో టీబీ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ కిరణ్‌కుమార్ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీగా వెళ్లనున్నారు.

ఏం కొనేటట్టు లేదు..

- పెరుగుతున్న కూరగాయల ధరలు
- రూ.100కు చేరువలో పచ్చిమిర్చి 6
- ఏ రకమైనా కిలో రూ. 50 పైమాటే





- భారంగా మారుతున్న బెస్ట్‌అవైలబుల్ స్కీం
- భరించలేమంటున్న పాఠశాలల యాజమాన్యాలు
- కోట్లలో రావాల్సి ఉన్నాయంటూ ఆవేదన
- ఇలా అయితే చదువు చెప్పలేమంటూ స్పష్టీకరణ

బకాయిల బెంగ!

● గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 1,200మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2022-23లో రూ.3కోట్లు, 2024-25లో రూ.3కోట్లు చొప్పున మొత్తం రూ.6కోట్ల వరకు బకాయిలున్నాయి. ఇక ఖమ్మం జిల్లా విద్యార్థులకు సంబంధించి సుమారు రూ.3కోట్లపైగా గిరిజన సంక్షేమశాఖ బకాయి పడింది.

● సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2022-23 నుంచి బకాయిలు పేరుకుపోగా.. ఖమ్మం జిల్లా పరిధిలో 1,243మంది విద్యార్థులకు సంబంధించి సుమారు రూ.8కోట్లు పెండింగ్ ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 400మందికి సంబంధించి సుమారు రూ.3కోట్ల వరకు బకాయిలున్నాయి.

ఖమ్మం, జూలై 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీల్లోని నిరుపేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించేందుకు నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ విద్యా పథకం అమలు ఏటికేడు తీసికట్టుగా మారుతోంది. ఏటా ఆ విద్యార్థుల పేరిట వారు చదువుతున్న విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన సొమ్ములు రూ.కోట్లలో బకాయి ఉండటంతో సంబంధిత యాజమాన్యాలకు ఈ పథకం భారంగా ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలో మాత్రమే విద్యాబోధన ఉంది. ప్రైవేటు పాఠశాలలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభమవడంతో అప్పట్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థుల్లో 1నుంచి 10తరగతి వరకు కొందరినైనా ఇంగ్లీష్‌మీడియంలో చదివించాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు అవసరమైన భోజన, వసతి సౌకర్యంతోపాటు ఆంగ్ల విద్యా బోధనను ప్రైవేటు పాఠశాలల ద్వారా కల్పించేందుకు బెస్ట్ అవైలబుల్ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట్లో ఐటీడీఏ గిరిజన విదార్థులకు ప్రవేశపెట్టింది.

చదువు చెప్పలేమంటున్న యాజమాన్యాలు

తొలుత ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం ఉన్న ప్రవేటు పాఠశాలలను గుర్తించి ఈపథకం ద్వారా అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి లాటరీ ద్వారా 1, 5తరగతుల్లో ప్రవేశాలు కల్పించింది. ఇలా బెస్ట్‌అవైలుబుల్ స్కీం పథకం కింద చదివిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎందరో చదువులో రాణించి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ రంగాలతో పాటు గెజిటెడ్ స్థాయి ఉద్యోగాలు కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి ఈ పథకం కొనసాగుతూనే ఉన్నా 2022-23 విద్యా సంవత్సరం నుంచి ఆ విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ప్రభుత్వం పాఠశాలలకు విడుదల చేయడం లేదు. సాంఘిక సంక్షేమ శాఖ నుంచి హాస్టల్ విద్యార్థులకు రూ.42వేలు, డేస్కాలర్లకు రూ.28వేలు చెల్లించాల్సి ఉంది. కానీ గిరిజన విద్యార్థులకు పూర్తిస్థాయిలో రెసిడెన్షియల్ స్థాయిలోనే విద్యాబోధన చేస్తుండగా.. మూడేళ్లుగా ప్రైవేటు పాఠశాలలకు రూ.కోట్లలో బకాయిలు పెట్టడంతో ఈ విద్యాసంవత్సరంలో తాము చదువు చెప్పలేమని ఇప్పటికే యాజమాన్యాలు సంబంధిత శాఖ అధికారులకు తెలియచేశాయి. గత బకాయిలు చెల్లిస్తేనే చదువు చెప్పగలుగుతామని సూచించాయి.

కోట్లల్లో బకాయిలు

పేద విద్యార్థులకు సంబంధించిన పథకం ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. విద్యార్థుల చదువులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని ఇటీవల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైనందున ఈఏడాది కూడా విద్యార్థులను ఇప్పటికే లాటరీ ద్వారా ఎంపికచేసి పాఠశాలలకు పంపారు. ప్రభుత్వం పెండింగ్ బిల్లులను మంజూరు చేయకపోతే చదువు చెప్పలేమని ఇప్పటికే యాజమాన్యాలు అధికారులకు స్పష్టం చేయడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం చెల్లించకపోతే తల్లిదండ్రులైనా చెల్లించాలన్న షరతులతో కొన్ని యాజమాన్యాలు లాటరీలో ఎంపికైన వారిని చేర్చుకుంటున్నాయి. పేద విద్యార్థులకు సంబంధించిన ఈపథకం లక్ష్యం పక్కదారి పట్టకుండా ఆదుకోవాలంటే నిధులు సకాలంలో (మిగతా 6వ పేజీలో)

అంగన్‌వాడీలకు

తీపికబురు

మూడు ప్రధాన డిమాండ్లు నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అంగవాడీ టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వారి డిమాండ్లలో మూడింటిని నెరవేరుస్తూ ఉత్తర్వులిచ్చింది. పదవీ విరమణ వయస్సు పెంపు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేత, 60 ఏళ్లు దాటిన వారికి స్వచ్ఛంద పదవీ విరమణకు అవకాశం కల్పిస్తూ శుభవార్త చెప్పింది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సంబరాలు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,840 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో 1,721మంది టీచర్లలు, 1,240మంది హెల్పర్లున్నారు. పదవీ విరమణ నూతన విధానానికి సంబంధించి ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 13 మంది టీచర్లు, 24మంది హెల్పర్లు పదవీ విరమణ చేసి ఎదురుచూస్తున్నారు. గతంలో టీచరు, హెల్పర్లకు 60 సంవత్సరాలకే పదవీ విరమణ ఉండేది. కానీ ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా 65 సంవత్సరాలకు పెంచింది. దీంతో పాటు 60 ఏళ్లకు స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతించిన వారందరికీ ప్రస్తుత బెనిఫిట్స్ అందుతాయని తెలిపింది. వీటితో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను పెంచింది. టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అందించనున్నారు. గతంలో టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేలు ఉండేది. దీంతో మరో ఐదు సంవత్సరాలు సేవలు అందించేందుకు అవకాశం లభించింది.

'పరిషత్' సమరానికి

కసరత్తు

ఎంపీటీసీ స్థానాల పునర్విభజనలో అధికారులు

ఇప్పటికే జడ్పీ, ఎంపీటీసీల ఓటరు జాబితాల రూపకల్పన

ఖమ్మం కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల కంటే ముందుగానే.. జడ్పీ, మండల పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించాలన్న యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్న వార్తలతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ దిశగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పరిషత్ అధికారులు ఎంపీటీసీ స్థానాల పునర్విభజనకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం రూరల్ మండలంలో కొత్తగా ఏదులాపురం మునిసిపాలిటీని , కల్లూరు మండలంలో కల్లూరు మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు. కల్లూరు మండలంలో గతంలో 18 ఎంపీటీసీ స్థానాలు ఉండగా పంచాయతీలు విడిపోయిన తర్వాత తాజాగా 13 ఎంపీటీసీ స్థానాలతో మంగళవారం అధికారులు ముసాయిదా నోటిఫికేషన్‌ను జారీ చేశారు. దీనిపై 8, 9 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆ తర్వాత 10,11 తేదీల్లో వాటిని పరిష్కరించి 12న తుదిజాబితాను సిద్ధం చేయనున్నారు. అయితే వీటి ప్రకారం జిల్లాలో తాజాగా 289 ఎంపీటీసీ స్థానాలకు గాను 283 అయ్యే ఆస్కారం ఉంటుంది. రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు ఇప్పటికే ఏంపీటీసీ, జడ్పీ స్థానాలలో గతంలో పోటీ చేసిన వివరాలను అధికారులు నివేదికలను పంపించారు. కులాల వారీగా ఏఏ వివరాలను పంపించారు.



ఓటర్ల జాబితా సిద్ధం

జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీల్లో ఓటర్ల జాబితాలు ఇప్పటికే రూపొందించారు. ఖమ్మం జిల్లాలో 20 మండల పరిషత్‌లో 287 (తాజాగా 283 ఎంపీటీసీ స్థానాలు)ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు. జిల్లా, మండల పరిషత్ అధికారులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఫిబ్రవరిలో విడుదల చేశారు. ఇప్పటికే గ్రామపంచాయతీల వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యే నాటికి వచ్చిన అదనపు ఓటర్లను కూడా చేర్చి జాబితాలు రూపొందించి ఆమోదించారు. 8,22,528 మంది ఓటర్లుగా లెక్కతేల్చారు. వీరిలో 3,97,766 పురుషులు, 4,24,739 మంది మహిళా ఓటర్లు, 23మంది థర్డ్ జెండర్లు ఉన్నట్లు తేల్చారు. 1607 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.. ఇక ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే ఈ జాబితానే వినియోగించనున్నట్లు జడ్పీ అధికారులు తెలిపారు.

మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు ఇలా..

జిల్లాలో 20 మండలాల్లో 287 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి. బోనకల్లు 13, చింతకాని 14, ఏన్కూరు 10, కల్లూరు 18 (ఇక్కడ 13 స్థానాలు ఖరారు కానున్నాయి), కామేపల్లి 12, ఖమ్మం రూరల్ 14, కొణిజర్ల 15, కూసుమంచి 17, మధిర 12, ముదిగొండ 17, నేలకొండపల్లి 18, పెనుబల్లి 15, రఘునాథపాలెం 13, సత్తుపల్లి 13, సింగరేణి 16, తల్లాడ 16, తిరుమలాయపాలెం 18, వేంసూరు 13, వైరా 10, ఎర్రుపాలెం మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. జిల్లా పరిషత్ పరిధిలో 20 ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ముగిసిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌ఆర్ బీజీ ఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జూలై 1 నుంచి మొదలైన మొదటి దశ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. మంగళవారం మొత్తం 800 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 780 మంది వెరిఫికేషన్‌కు హాజరైనట్లు కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు.

బాల పురస్కార్ అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై8(ఆంధ్రజ్యోతి): సాహసాన్ని ప్రదర్శించి ఆపదలో ఉన్న బాల, బాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల నుంచి జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ 2025-26 ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభాపాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహస కార్యక్రమాలు తదితర అంశాలలో అవార్డులను అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ నూతన కలెక్టరేట్ ఖమ్మంలో అందించాలని తెలిపారు.

ఏం కొనేటట్టు లేదు..

- పెరుగుతున్న కూరగాయల ధరలు
- రూ.100కుచేరువలో పచ్చిమిర్చి
- ఏ రకమైనా కిలో రూ. 50 పైమాటే
- మిగితా కూరలు ధరలు పైపైకే
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఖమ్మం మార్కెట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైతుబజార్లు, బహిరంగ మార్కెట్‌లలో కూరగాయలను ముట్టుకుంటే మంట పుడుతోంది. ఖరీఫ్ సీజన్ మొదలవడంతో పాటు కూరగాయల పంటలు ప్రస్తుతం సాగు దశలో ఉండటంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక కూరగాయల ధరలు కొండెక్కాయి. రైతు దగ్గర పంట లేదు, ఈకాలం పంట పండదు. ఇదే అదునుగా కూరగాయల వ్యాపారులు ధరలు పెంచి వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారు. దీంతో సామాన్యుడి వంటగదిలో కూరలు ఉడకకుండానే కుతకుతమంటున్నాయి.

ఎగబాకిన ధరలు..

టమోటా ఎప్పుడూ కిలో రూ.15 నుంచి రూ.20లకు మార్కెట్‌లలో లభ్యమయ్యేవి. అలాంటి టమోటా ఇప్పుడు కిలో రూ.42ల నుంచి రూ.60లకు చేరింది. పది రోజుల క్రితం కిలో రూ. 40లు ఉన్న పచ్చి మిర్చి ప్రస్తుతం రూ.80లు నుంచి రూ.100లకు చేరింది. దీంతో వినియోగదారుడిపై రెండు, మూడు రెట్ల అధిక ధరల భారం పడింది. మార్కెట్‌లలో టమోటానే కాకుండా ప్రతి కూరగాయ ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో కిలో రూ.20ల లోపు లభించే ప్రతీ కూరగాయలు ప్రస్తుతం కిలో రూ.40 ల నుంచి రూ.50లకు, రూ.10లకు రూ.3 ఆకుకూరల కట్టలు సీజన్‌లో వస్తే ఇప్పుడు రూ.20లకు రూ.4ఆకుకూరల కట్టలు ఇచ్చే విధంగా చేరాయి. గత రెండు వారాల నుంచి నగరంలోని రైతుబజార్‌లు, బహిరంగ కూరగాయల మార్కెట్‌లలో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి.

సామాన్యులకు చుక్కలే...

సామాన్యుడు కూరగాయలు కొనాలంటేనే బెంబేలెత్తుతున్నాడు. రోజు రోజుకూ కూరగాయల ధరలు పెరుగుతూ పేద, మధ్యతరగతి వినియోగదారులకు చుక్కలు చూపిస్తునాయి. ఇక పోతే రోజు వారీ కూలీలు తమకు రోజూ వచ్చే కూలీ పైసలతో కూరగాయలు కొనుగోలుకే సరిపోతున్నాయంటు వాపోతున్నారు. డిమాండ్‌కు సరిపడా లోకల్ కూరగాయల నిల్వలు లేక ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాలనుంచే కాకుండా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో రవాణా చార్జీల భారం సైతం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం రైతుబజార్, బహిరంగ మార్కెట్‌లలో కూరగాయల ధరలు

కూరగాయలు(కిలో)	ధర(రూ)
టమోటా	42-50
వంకాయ	36-50
బెండకాయ	40-50
పచ్చిమిర్చి	80-100
కాకరకాయ	50-60
బీరకాయ	50-60
క్యాబేజీ	30-40
దొండ	60-70
సొరకాయ	30-40
క్యారెట్	60-70
ఆలుగడ	28-30
ఉల్లిగడ్డ	35-40
కోడిగుడ్ల ట్రే	180- 190
కొత్తిమీర కట్ట	30-40



అధికారులకు భూమిపత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ మణిధర్

బీజీ కొత్తూరులోనే నవోదయ పాఠశాల

అశ్వాపురం, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలోనే జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. మంగళవారం బీజీ కొత్తూరు గ్రామసమీపంలోని 997 సర్వే నెం.లో గల 30ఎకరాల ప్రభుత్వభూమిని సర్వే నిర్వహించి తహసీల్దార్ మణిధర్ నవోదయ అధికారులకు గ్రామస్థుల సమక్షంలో పత్రాలను అప్పగించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జవహర్ నవోదయ పాఠశాలకు కేంద్రప్రభుత్వం 2023 మేనెలలోనే గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నవోదయ పాఠశాలను గిరిజన ప్రాంతమయిన పినపాక నియోజకవర్గానికి కేటాయించింది. అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరులో ఏర్పాటు చేసేందుకు అప్పటి కలెక్టర్ ఇక్కడ కాగా ఆర్‌అండ్‌బీ రహదారినుంచి పాఠశాల ఏర్పాటయ్యే ప్రదేశం వరకూ రూ. 1.5 కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణపనులు కూడా జరుగుతున్నాయి.

ఇంకెన్నాళ్లీ దురాచారం?

- ఆదివాసీ గ్రామంలో కుల బహిష్కరణ
- ఐదు కుటుంబాలపై వివక్ష
- ఏడాదిగా వెలి వేసిన పెద్దలు
- పోలీసులకు ఆశ్రయించిన బాధితులు



మాట్లాడుతున్న బాధితులు

ఇల్లెందు టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గ్రామంలో భూ వివాదంలో కులపెద్దల మాటకు కట్టుబడి ఉండలేదనే కారణంతో ఐదు ఆదివాసీ కుటుంబాలను సంవత్సర కాలంగా వెలివేశారు. గ్రామంలో పెళ్లిళ్ల, పేరంటాలు తదితర కార్యక్రమాలు జరిగిన పిలవకపోవడంతో పాటు వారి కుటుంబంలో ఏది జరిగిన గ్రామస్థులు వెళ్లకుండా కట్టడి చేశారు. వ్యవసాయ పనులకు సైతం వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో బాధితులు ఇల్లెందు పోలీసులు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీపీఎం కార్యాలయంలో బాధితులు ముడిగె రాములు, ముడిగె సీతమ్మ, సుగుణ, లక్ష్మీనారాయణ తదితరులు వివరాలను వెల్లడించారు. ఇల్లెందు మండలం పాతపూసపల్లి గ్రామానికి చెందిన తమను సంవత్సర కాలంగా గ్రామంలో నుంచి అకారణంగా బహిష్కరించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఎనిమిదిన్నర ఎకరాల పట్టా భూమిని వేరే వారికి ఇవ్వాలని, గ్రామ పెద్దలు ఇచ్చిన తీర్పును వ్యతిరేకించామని, ఆ కారణంతో తమను కుల బహిష్కరణ చేస్తున్నట్లుగా ప్రకటించారని తెలిపారు. గ్రామ పెద్దలైన సుర్దపాక వెంకట నారాయణ, వర్సా అవినాష్, సత్యనారాయణ, కృష్ణ తదితరులు తమను నిత్యం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గత మే 20న ముడిగె రామలక్ష్మి అనే మహిళ మృతి చెందితే గ్రామం నుంచి ఎవరినీ రానివ్వకుండా, కనీసం దహనసంస్కారాలకు కూడా సహకరించకుండా ఇబ్బందులకు గురిచేశారని వాపోయారు. తమ బంధువులు దహన సంస్కారాలకు సహకరిస్తే వారిని సైతం బెదిరించారని ఆరోపించారు. తమ పొలం పనులకు కూడ ఎవర్నీ కూలీకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని, పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయిస్తే గ్రామంలో ఉన్న ఆటో డ్రైవర్లు పిల్లలను ఎక్కించకుండ వదిలేశారని వాపోయారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే ఎందుకు వారికి ఇచ్చారని అధికారులను బెదిరించడంతోపాటు గ్రామంలో ఉన్నవారిని వచ్చిన ఇళ్లను తీసివేయాలని తీవ్రంగా ప్రయత్నాలు చేశారని తెలిపారు. గ్రామ పెద్దమనుషులతోపాటు మరికొంతమంది ప్రోద్భలంతోనే సంవత్సరం కాలంగా తమను సాంఘిక బహిష్కరణ కన్నీటి పర్యంతం అయ్యారు.

మునగ సాగుపై మక్కువ పెంచుకోవాలి

- పంట వ్యర్థాలతో బయోచార్‌కోల్ తయారీ
- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



రైతు చేనులో బయోచార్‌కోల్ గుంతను తీస్తున్న కలెక్టర్

టేకులపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రైతులకు లాభదాయకమైన మునగ సాగుపై రైతులు మక్కువను పెంపొందించుకోవాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంపురం పంచాయతీ పరిధిలోని పాతతండా గ్రామానికి చెందిన భూక్యా గాంధీ మునగతోటను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించి మునగా సాగును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చేలల్లో పంట వ్యర్థాలతో బయోచార్‌కోల్ తయారీ, ఉపయోగించడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కొంతమంది రైతులు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరానికి వెయ్యి మొక్కలు నాటి లాభాలు పొందుతున్నారన్నారు. మండలంలోని ప్రతీ రైతు, ప్రస్తుతం పత్తి పంట సాగుచేస్తున్న రైతులందరూ పత్తి, పామాయిల్ చేలల్లో అంతర్‌పంటగా మునగను సాగుచేసుకొని లబ్ధిపొందాలని రైతులకు సూచించారు. మునగ సాగు వల్ల రైతులకు మునగ ఆకులు, కాయలు, ఎండిన విత్తనాల ద్వారా అధిక ఆదాయం వస్తుందన్నారు.

మునగ పంటను సాగుచేయడం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. బయోచార్‌కోల్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పంట వ్యర్థాలైన పత్తికట్టెలు, కంది కట్టెలు, వరిపొట్టును చేలల్లో వట్టిగానే తగలబెట్టే బదులు వాటితో రైతులే బయోచార్‌కోల్ తయారుచేసుకొని రసాయన ఎరువులను తగ్గించుకోవాలన్నారు. రైతులు తమ పొలాల్లో నీరు నిల్వఉండే ప్రాంతంలో మీటరు వెడల్పుతో కోన్‌ఐస్‌క్రీం పోలిక వల్లె గుంతను ఏర్పాటు చేసుకోవాలని, ఆ గుంతలో పత్తి, కంది, మొక్కజొన్న ఇతర పంట వ్యర్థాలను వేసి పాక్షికంగా కాల్చివేసినట్టయితే బొగ్గులు తయారవుతాయన్నారు. గుంతలో తయారైన బొగ్గులలో పశువుల పేడ, ఆవుమూత్రం కలిపి వారం రోజులు మాగపెడితే సేంద్రియ ఎరువు తయారవుతుందన్నారు. ఈ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. రసాయన ఎరువులు డీఏపీ, యూరియాలకు రైతులు తయారు చేసిన బొగ్గు(చార్‌కోల్)ను కలిపి పంటపొలాల్లో ఉపయోగించినట్టయితే వర్షాలకు కొట్టుకొనిపోకుండా పట్టిఉంచుతుందన్నారు. రైతుచేలో బయోచార్‌కోల్ తయారు చేయం కోసం కలెక్టర్ రైతులతో కలిసి గుంతను తవ్వారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, తహసీల్దార్ వీరభద్రం, ఎంపీవో గణేష్ గాంధీ, ఏవో అన్నపూర్ణ, ఏఈవో భాగ్యశ్రీ పాల్గొన్నారు.

దేవుడే.. దిగిరావాలేమో!

(5వ పేజీ తరువాయి)

వసూలు చేసేవారు. ఈ విధంగా ఏటా రూ.30 లక్షల వరకు వసూలయ్యేది. అయితే గత కొన్నేళ్లుగా ఈ చెల్లింపులు సైతం దేవస్థానంకు లేకపోగా

కబ్జా చేస్తే పీడీ యాక్టు : మంత్రి కొండా సురేఖ

భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి, సిబ్బందిపై దాడి జరిగిన ఘటన విషయంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. దేవస్థానాల ఈవోలపై దాడులు

చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. దేవుని భూములు కబ్జా చేస్తే పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. భద్రాద్రి రామయ్య భూముల సమస్యను పరిష్కరించాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడును మంత్రి కొండా సురేఖ కోరారు. కాగా ఈవో, సిబ్బందిపై దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్‌వి పాటిల్ ఆరా తీసారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది?, దాడి ఎలా జరిగింది? తదితర అంశాలను వారు ఈవోను అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పరామర్శించి ఈవోపై దాడిని ఖండించారు. దాడి చేసిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కాగా భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు కూడా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఈవో రమాదేవి, కాంట్రాక్టు ఉద్యోగి వినీల్‌ను పరామర్శించారు.

ఆరా తీస్తున్న పోలీసు నిఘా వర్గాలు

పురుషోత్తపట్నంలోని రామయ్య భూముల్లో దేవస్థానం అధికారులు, సిబ్బందిపై ఆక్రమణదారులు దాడి చేసిన ఘటనపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని పోలీసు నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఈ విషయమై విస్తృతంగా ప్రచారం కావడంతో దాడి ఏ విధంగా జరిగింది అనే దానిపై తమదైన శైలిలో పోలీసు నిఘా వర్గాలు సమాచారాన్ని సేకరిస్తున్నాయి. అదేవిధంగా ఈవో రమాదేవి నుంచి కూడా నిఘా వర్గాలు వివరాలు సేకరించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం ఈవో, ఆలయ ఉద్యోగులపై దాడి హేయమైన చర్య అని మేజరు టెంపుల్ జేఏసీ కో చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ అన్నారు. ఆక్రమణ చేసిన వారిని ఖాళీ చేయమని కోరగా ఈవో, సిబ్బందిపై దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

దేవస్థానం ఈవో రమాదేవి , సిబ్బంది పై జరిగిన దాడిని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య, కార్యదర్శి యు మహేష్, ఎన్జీవోస్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు డెక్క నరసింహారావు, గగ్గూరి బాలకృష్ణ, తెలుగుదేశం, బీజేపీ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఈవోను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వర్షాలు పడకముందే..



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(5వ పేజీ తరువాయి)

జరుగుతుందన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాలతో పాటుగా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మొక్కలు నాటటం, వృక్షాల సంరక్షణ చేపట్టాలని సూచించారు. పరిశుభ్రమైన రక్షిత తాగునీరు సరఫరాచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మమేకమై మాట్లాడారు. వారి సమస్యలను విని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ రావూరి కరుణ, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల బెంగ!

(5వ పేజీ తరువాయి)

విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా ఈ విద్యా పథకానికి విడుదలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవైపు ప్రైవేటు పాఠశాలల్లో రెసిడెన్షియల్ చదువులకు ఫీజులు భారీగా పెరుగుతున్నా బెస్ట్‌అవైలబుల్‌స్కీం కింద ప్రైవేటు యాజమాన్యాలు చదువులు చెబుతున్నాయి. ఈపరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఏ విద్యాసంవత్సరానికి ఆ విద్యాసంవత్సరంలోనే నిధులు ప్రభుత్వం కేటాయిస్తే విద్యార్థులకు చదువు చెప్పడంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని యాజమాన్యాలు.. తమకు, పిల్లలకు ఆందోళన ఉండదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పాము కాటుకు కూలీ మృతి

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో సోమవారం పాము కరవడంతో ఓ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మర్లపాడు గ్రామానికి చెందిన కమ్మకంటి వెంకట్ (35) గ్రామ సమీపంలో ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం ఉదయాన్నే పొలానికి వెళ్లాడు. సాయింత్రం 5 గంటల సమయంలో పొలం పనుల్లో ఉండగా విషపు పాము కాటువేసింది. ఈ సమయంలో వెంకట్‌ను వైద్యం కోసం తోటి కూలీలు కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందినవాడు. భార్యతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకట్ మృతితో ఆ కుటుంబం జీవనోపాధి కోల్పోయింది.



పాము కాటుకు మృతి చెందిన కూలీ కమ్మకంటి వెంకట్

ఉద్యానం.. అధ్వానం..

- అడవిని తలపిస్తున్న జేవీఆర్ పార్కు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- బాగోగులు మరిచిన మునిసిపాలిటీ

సత్తుపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో 17 ఏళ్ల క్రితం ప్రారంభంమైన జేవీఆర్ (జలగం వెంగళరావు)పార్కు నిర్వాహణ లోపంతో అధ్వాన్నంగా తయారైంది. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో 2008లో సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో జేవీఆర్ పార్కును నిర్మించారు. దీనిని అదే ఏడాది జనవరి 27న అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. పార్కు ప్రారంభించిన తరువాత మూడేళ్ల పాటు దీని నిర్వహణ బాగానే ఉన్నా.. ఆ తరువాత కాలంలో దీనిని పట్టించుకోలేదు. దీంతో పార్కు అధ్వానంగా మారింది.

రూ. మూడు కోట్లు ఖర్చయినా..

పార్కు నిర్మాణానికి సింగరేణి సంస్థ షేప్ నిధులు రూ.60లక్షలు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.ఐదు లక్షలు, తెలంగాణా ప్రాంతీయ అభివృద్ధి బోర్డు నిధులు, టూరిజం విభాగం నిధులతో పాటు మునిసిపల్ ఇతర నిధులను రూ.మూడు కోట్ల వరకూ ఖర్చు చేశారు. తరువాత కాలంలో దీని నిర్వాహణ కోసం నిధులు కేటాయించకపోవటంతో పార్కు నామరూపాల్లేకుండా తయారైంది.



జేవీఆర్ పార్కు ముఖ ద్వారం

అన్ని హంగులతో పార్కు నిర్మాణం

పార్కు నిర్మాణంలో భాగంగా మొక్కలు నాటారు. వాకర్స్ కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్‌లను ఏర్పాటు చేశారు. పార్కు ఆవరణలో హైవేను ఆనుకొని రెస్టారెంట్‌ను కూడా నిర్మించారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాట్లు కూడా చేశారు. దీన్ని ప్రారంభించిన తొలినాళ్లలో సత్తుపల్లి పట్టణ వాసులు పార్కును తరచూ సందర్శించే వారు. వాకర్స్ కూడా జేవీఆర్ పార్కులో వాకింగ్‌కు వచ్చేవారు. నిర్వాహణ గాలికొదిలేయటంతో పిచ్చి మొక్కలు మొలిచి ఆవరణ భయంకరంగా మారింది. పాములు, విష పురుగులకు నిలయంగా ఉంది. ఓపెన్ జిమ్ నామరూపాల్లేకుండా పోయింది. వాకింగ్ ట్రాక్ పిచ్చిమొక్కలు, గడ్డితో మూసుకొనిపోయింది. లైటింగ్ సిస్టం కనిపించని పరిస్థితి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కు వైపు వెళ్లాలంటే పట్టణ వాసులు భయపడుతున్నారు. గత కొన్నేళ్లుగా దీని నిర్వాహణను వదిలేశారు. ఇప్పటికైనా పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. పార్కు అభివృద్ధిపై సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ నరసింహను సంప్రదించగా పార్కు అభివృద్ధికి సంబంధించి నిధుల సమీకరణపై దృష్టి సారించామని అన్నారు.



అడవిని తలపిస్తున్న పార్కు ఆవరణ



అధ్వానంగా వాక్ వే

పోలీస్‌స్టేషన్ ఎదుట పోడు రైతుల నిరసన

- తమను అక్రమంగా అరెస్టు చేశారంటూ బైఠాయింపు
- 20మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన పోడు రైతులు

పాల్వంచ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట పోడు రైతులు బైఠాయించి నిరసన తెలిపిన సంఘటన పాల్వంచ మండలం కిన్నెరసానిలో మంగళవారం జరిగింది. బూర్గంపాడు, అశ్వాపురం మండలాలకు చెందిన కొందరు రైతులు రెడ్డిగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలోని పోడుభూమిలో వ్యవసాయం చేసుకోవడానికి తరలొచ్చారు. పొలాలను చదును చేయడానికి తమతో పాటు ట్రాక్టర్లను తీసుకొచ్చిన క్రమంలో పాల్వంచ రూరల్ పోలీసులు వారిని అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో తాము 2007లో ఆ భూమిలో పోడు చేసుకున్నామని, అది తమకు చెందిన భూమి అని, తమను పోలీసులు అక్రమంగా ఎందుకు నిర్బంధిచారో చెప్పాలంటూ స్టేషన్ ఎదుట బైటాయించారు. కానీ వారంతా బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన గోల్లమారి రత్నారెడ్డి అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించారని, చదును చేయడమే కాకుండా సదరు రైతును బెదిరించారని, అందుకే వారందరినీ అదుపులోకి తీసుకుని మోరే రవితో పాటు 20 మందిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

అడ్మిషన్లు పెరిగేలా కృషి చేయాలి

- ఇంటర్మీడియట్ విద్య డిప్యూటీ కార్యదర్శి హేమచందర్



మాట్లాడుతున్న హేమచందర్

దుమ్ముగూడెం జూలై 8 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా కృషి చేయాలని ఇంటర్మీడియట్ విద్య డిప్యూటీ కార్యదర్శి సీహెచ్.హేమచందర్ అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. డ్రాపవుట్స్ లేకుండా ప్రతీ ఒక్క విద్యార్థి కళాశాలకు హాజరయ్యేలా చూడాలని, సూచించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై8(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. మంగళవారం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీ స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది యొక్క ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని , వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పని తీరు గురించి పరిశీలించారు. స్టేషన్ పరిధిలో అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారీన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్ , బ్లూకోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్ 100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఈ క్రమంలో ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీతో పాటు అధికారులు, సిబ్బంది మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ సీఐలు శివప్రసాద్, కరుణాకర్, ప్రతాప్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు పురుషోత్తం, విజయకుమా పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను ధ్వంసం చేసిన బీఆర్ఎస్

- పేరుకే విద్యా కమిషన్లను ఏర్పాటు చేసిన కాంగ్రెస్
- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ విధ్వంసానికి గురి కాగా మార్పు కొరుతూ ప్రజలు, విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొస్తే పేరుకే విద్యా కమిషన్‌లు ఏర్పాటు చేసిందని గత ప్రభుత్వం కంటే అరకొరగా బడ్జెట్‌లో నిధులు పెంచినా విద్యారంగానికి చెప్పుకొదగ్గ ప్రాముఖ్యత కల్పించలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ ఆరోపించారు. మంగళవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించిన నాయకులు, అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కాంపాటి పృథ్వీ మాట్లాడారు. విద్యకు 15శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ కేవలం 7శాతం నిధులు బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. ప్రభుత్వ యూనివర్శిటీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ నిర్వాహణ సక్రమంగా లేదని ప్రభుత్వం మాత్రం ప్రపంచ మహిళా అంధాల పోటీలు నిర్వహించిందన్నారు. మరో పక్క స్కిల్ యూనివర్శిటీలు తీసుకోస్తామంటూ ప్రచారం చేస్తుందన్నారు. సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆవుల అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26వేల పాఠశాలలు మూసి వేతకు గురైతుంటే ఇంటిగ్రేటెడ్ వసతిగృహాల పేరుతో విద్యార్థులను వంచనకు గురి చేస్తొందని ఆరోపించారు. ప్రభుత్వ వసతిగృహాల్లో శాశ్విత భవనాలు లేక అద్దే భవనాలు, శిదిలమైన భవనాల్లో ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ విద్యాభ్యాసం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు ఝాన్సీ, జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్, నాయకులు శశి, కార్తీక్, శ్రీను, పేర్ల వెంకటేష్, ప్రసాద్, పాషా, ప్రణావ్, స్టాలిన్, నరేందర్, అనూష, అఖిల పాల్గొన్నారు.

12న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నా

- జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పులి లక్ష్మయ్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 12న తెలంగాణ రాష్ట్రంలోని అన్ని శాఖలు, కార్పోరేషన్లలో, సంస్థలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మహాధర్నా నిర్వహిస్తున్నామని రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు పులి లక్ష్మయ్య మంగళవారం అన్నారు. అందుకు సంబంధించిన పోస్టర్లను భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ముఖ్య అతిధిగా పాల్గొని జిల్లా అధ్యక్షుడు దిలీప్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి తక్షణమే కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఏప్రిల్ 2025వ సంవత్సరం నుండి తొలగించిన సిబ్బందిని తక్షణమే వీధుల్లోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బోనగిరి రవికిరణ్, ఎం.అన్వేష్, శ్రీనివాస్, షబ్బీర్ మాన్సింగ్, నిర్మల్ కుమార్, వెంకట్రావు, పద్మ, నాగరాజు, సత్యనారాయణ, దిలీప్ కార్తీక్ , శివ, సువర్ణ, కృష్ణ, శివ, రాజ్‌కుమార్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్‌ను సందర్శించిన జెన్కో డైరెక్టర్

మణుగూరు రూరల్ జూలై 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను జెన్కో డైరెక్టర్(థర్మల్, ప్రాజెక్టు) రాజశేఖర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. బీటీపీఎస్‌లో జరుగుతున్న వివిధ పనులను పర్యవేక్షించారు. పెండింగ్ పనుల వివరాలను సీఈ బిచ్చన్నను అడిగి తెలుసుకున్నారు. రైల్వే ట్రాక్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. పనులను త్వరగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఏమైనా అండంకులు తలెత్తితే సంస్థ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్లాంట్ సీఈ బిచ్చన్న, ఎస్సీ రాంప్రసాద్, డీఈలు, ఏడీఈలు, కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

పిల్లలతో స్నేహ పూర్వకంగా మెలగాలి

- భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరచారి

పాల్వంచ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లావిద్యాశాఖాధికారి ఎం. వెంకటేశ్వరచారి అన్నారు. మంగళవారం వికలాంగులకాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలలో జరిగే కార్యక్రమాలపై పిల్లలతో చర్చించాలని అన్నారు. హోం వర్క్, క్లాస్ వర్క్ పూర్తి చేశారా లేదా అని తెలుసుకోవాలన్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంట్లో చదవడానికి ఒక ప్రదేశాన్ని ఏర్పాటుచేయాలని, విద్యార్థులు ప్రశాంతంగా చదవడానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుకునే సమయంలో మొబైల్‌ఫోన్ వినియోగాన్ని నివారించాలన్నారు. అదే విధంగా పిల్లలు మొబైల్ ఉపయోగించే సమయంలో తల్లిదండ్రులు వారిని పర్యవేక్షణ చేయాలని కోరారు. విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించే బాధ్యతగా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలలో చేపట్టిన కిచెన్ గార్డెన్ అమలు, డిజిటల్ పాఠాల కోసం ఇంటరాక్టివ్‌ప్లాట్ ప్యానల్స్ వినియోగం ఉచిత యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ, ఏఏపీసీ ద్వారా పరిశుభ్రంగా, ఆరోగ్యంగా మధ్యాహ్న భోజనం అందచేయడం పట్ల తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఎస్‌కే. సైదులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించడానికి సిద్ధంగా ఉన్నారని, వారి విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలకు కావాల్సిన నాణ్యమైన విద్యను వారికి అందించేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరచారి

ఇందిరమ్మ కమిటీ సభ్యులపై

చర్యలు తీసుకోవాలని ఆందోళన



సుజాతనగర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు, నాయకులు

సుజాతనగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ బేతంపూడి గ్రామపంచాయతీకు చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అవినీతికి పాల్పడ్డారని వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యలయం ఎదుట గ్రామస్థులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. వీరి ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనంతరం కొత్తగూడెం డివిజన్ ఆత్మకమిటీ ఛైర్మన్ బత్తుల వీరయ్య మాట్లాడుతూ స్టేషన్ బేతంపూడిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బులు తీసుకుని అనర్హులకు ఇళ్లను మంజూరు చేయించి, అర్హులకు అన్యాయం చేశారని ఆరోపించారు. కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నా కుమారుడి ఆచూకీ తెలపండి

- పాల్వంచలో ఓ తల్లి కన్నీటిపర్యంతం
- నెలరోజులైనా పోలీసులు స్పందించడం లేదని ఆరోపణ

పాల్వంచ,జూలై8(ఆంధ్రజ్యోతి):తన కొడుకు కనిపించకుండా పోయి నెలరోజులు కావస్తుందని, ఆచూకీ తెలపాలని ఓ తల్లి పోలీసులను వేడుకుంటుంది. ఫిర్యాదు చేసి నెల రోజులు దాటినా.. పోలీసుల నుంచి ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే సదరు మహిళ పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించింది. పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన ధర్మసోత్ సంతోష్(25) స్థానికంగా తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ముగ్గురుతో కలిసి మే27న తాపీ పని మీద వేరే ఊరు వెళతున్నానని ఇంట్లోని తల్లి హచ్చికి చెప్పి వెళ్లాడు. కానీ వారం గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె ఆ ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించింది. అతడి గురించి చెప్పడానికి నిరాకరించడంతో జూన్4న పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ నేటికీ ఆచూకీ చెప్పటం లేదు. అనుమానితులను ఇంతవరకూ పోలీసులు ప్రశ్నించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా పోలీసులు తన బిడ్డ బతికున్నాడా లేక చనిపోయాడో తెలపాలని వేడుకుంటుంది.

సార్వత్రిక సమ్మెకు బీజేపీయేతర కార్మిక సంఘాల కార్యాచరణ

- దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నేడు ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపు
- నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్
- సింగరేణిలో సమ్మె వద్దంటూ యాజమాన్యం విన్నపం





మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి,వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న గౌతమ్ పోత్రు

ఖమ్మంసంక్షేమవిభాగం,జూలై8(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉమ్మడి జిల్లా బంద్‌కు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందుకోసం బీజేపీయేతర అనుబంధ సంఘాలు ప్రత్యేక కార్యాచరణ చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులపై కొన్ని సడలింపులు చేశాయి. ఈ క్రమంలోనే ఎన్నో ఏళ్లుగా అమలులో ఉన్న కొన్ని కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చింది. వీటి ద్వారా కార్మికుల హక్కులు తొలగిపోతున్నాయని హక్కులకు భంగం కలుగుతుందని కొన్నేళ్లుగా వామపక్ష కార్మిక సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ పొందిన వారికి కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అటవీహక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, కార్మికుల 18డిమాండ్‌లతో పాటుగా లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ప్రధాన నినాదంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చారు. డిమాండ్ అయితే ఇటీవల కాలంలో బీజేపీయేతర కార్మిక సంఘాలు వామపక్ష కార్మిక సంఘాలతో కలిసి జాతీయస్థాయిలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి.దీంతో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు, కర్షకలు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యవసాయ కార్మికులతో సహా సమ్మెలో పాల్గొననున్నారు.

నేడు సింగరేణిలో కార్మికుల సమ్మె

మైన్స్,డిపార్టుమెంట్లవద్ద పోలీసుల పహారా

రుద్రంపూర్:సింగరేణిలోనూ సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సమ్మెను పటిష్టంగా తీసుకుని విజయవంతం చేసే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. సమ్మెకు దూరంగా ఉండాలంటూ సింగరేణి యాజమాన్యం పిలుపునిచ్చింది. మంగళవారం సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్‌పోత్రు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సింగరేణి వ్యాప్తంగా కార్మికులు సమ్మెకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులకు సంబంధించిన సమస్యలు ఏమి లేవని తెలిపారు. బొగ్గు ఉత్పత్తికి, రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఒక్కరోజు సమ్మె కారణంగా సింగరేణి బొగ్గు ఉత్పత్తికి రూ.76 కోట్ల నష్టం జరుగుతుందని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు, జీఎంలు కవితానాయుడు, సెక్యూరిటి జీఎం సీహెచ్. లక్ష్మీనారాయణ, అజయ్‌కుమార్, వరప్రసాద్, రాజ్‌గోపాల్, వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మద్యం తాగించి బీరు బాటిల్‌తో దాడి

మదిరరూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): మదిర మండలం ఆత్కూరు గ్రామంలో ఓ వ్యక్తిపై మద్యం మత్తులో బీరుబాటిల్‌తో విచక్షణారహితంగా దాడి చేశారు. మదిర మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన కంభంపాటి రవి అనే వ్యక్తిపై ఇదేగ్రామానికి చెందిన మందా వీరయ్య అలియాస్ కరుణాకర్ ఆదివారం రాత్రి మద్యం మత్తులో బీరుబాటిల్‌తో తలపై దాడిచేసి తీవ్రంగా కొట్టాడు. ఆదివారం సాయంత్రం సమయంలో బాధితుడు రవిని తీసుకొని వెళ్లి ఆయన పూటుగా మద్యం తాగించి కరుణాకర్ ఈ దాడికి పాల్పడ్డాడు.గ్రామశివారులో ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన రవి స్పృహతప్పి పడిపోవటంతో చనిపోయాడని అక్కడి నుంచి కరుణాకర్ వెళ్లిపోయాడు. సోమవారం తెల్లవారుజామున రవి స్పృహలోకి వచ్చి రోడ్డు పక్కనున్న చెట్ల పొదల్లో మూలుగుతూ కన్పించడంతో అటువైపు వాకింగ్‌కు వెళ్తున్న వారు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆసుపత్రిలో చేర్పించిన తర్వాత బాధితుడి కుటుంబసభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. మదిర టౌన్ ఎస్‌హెచ్‌వో రమేష్ కేసు నమోదు చేశారు. అక్రమ సంబంధం వ్యవహారమే కారణమని గ్రామంలో జోరుగా చర్చ సాగుతుంది.

మహిళలు.. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

ఖమ్మంలీగల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మహిళలందరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని న్యాయసేవాసంస్థ కార్యదర్శి కే.వి.చంద్రశేఖరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయచైతన్య సదస్సులో ప్రసంగించారు. గృహహింస చట్టంతో పాటు మనోవర్తి కేసుల్లో కోర్టులో దాఖలుచేసే ముందు వాటిలో అన్ని వాస్తవాలే రాయాలని, కేసుతో సంబంధం లేని వ్యక్తుల గూర్చి కేసుల్లో రాయకూడదని వివరించారు. మహిళలు అభివృద్ధి చెందితే సమాజంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాసంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు

గాయాలతో జింక మృత్యువాత

- భద్రాద్రి జిల్లా బెండాలపాడు శివారులో ఘటన



గాయాలతో పత్తి చేలోకి వచ్చి మృతిచెందిన జింక

చంద్రుగొండ, జూలై8(ఆంధ్రజ్యోతి): అడవి నుంచి తీవ్రగాయాలతో సమీపంలోని పత్తి చేలల్లోకి వచ్చిన ఓజింక(సాంబార్).. కొంతసేపటి మృతి చెందిన ఘటన మంగళవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులో జరిగింది. స్థానికులు, అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మద్దుకూరు ప్రాజెక్టు వైపు నుంచి మధ్యాహ్నం సమయంలో బెండాలపాడు బాలికుంట గ్రామాల మధ్య అడవిలో నుంచి గాయాలతో ఓ జింక పత్తి చేలలోకి వచ్చింది. చేలల్లో పని చేస్తున్న వారు గమనించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు జింక ఉన్న ప్రదేశానికి చేరుకొనే సమయానికి ఆ జింక మృతి చెందింది. మృతి చెందిన జింకకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేస్తామని చంద్రుగొండ రేంజ్ అధికారి ఎల్లయ్య తెలిపారు.

70కిలోల నకిలీ పత్తి విత్తనాల స్వాధీనం

- తల్లాడలో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

తల్లాడ, జూలై8(ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం మండలం కాచారంలోని నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రంపై తల్లాడ ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ దాడిచేసి ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.80లక్షల విలువైన 70కిలోల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. కాచారం గ్రామానికి చెందిన బ్రహ్మాజీ, నూజివీడుకు చెందిన సాంబయ్యలను అరెస్టు చేశారు. వీరితో పాటు స్థావరంలోని 120 లేబుల్‌కవర్లు, ప్యాకింగ్‌కు వాడేమిషన్, తూకం వేసే కాటాలను సీజ్ చేశారు. ఈనెల4న నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ, ఏవో ఎండీ తాజుద్దీన్ తల్లాడలో సోదాలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. దీంతో ఎర్రుపాలెం మండలంలో నకిలీ పత్తి విత్తనాల తయారీ సమాచారం తెలిసింది.ఈ నేపథ్యంలో కాచారంలోని నకిలీ పత్తి విత్తనాల తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహిచారు. నకిలీ పత్తి విత్తనాలకు సంబంధించి గుంటూరుకు చెందిన శ్రీధర్‌తోపాటు మరికొంతమంది పాత్రపై విచారించాల్సి ఉందని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో

చర్చి భూముల రిజిస్ట్రేషన్

మంత్రి పొంగులేటికి ఫిర్యాదు చేసిన డోర్నకల్ సీఎస్ఐ బిషప్



నకిలీ నిరభ్యంతర పత్రాన్ని చూపుతున్న బిషప్ పద్మారావు

డోర్నకల్, జూలై8(ఆంధ్రజ్యోతి): డోర్నకల్ సీఎస్ఐ అధ్యక్షపీఠం పరిధిలోని భూములను కొందరు వ్యక్తులు నా సంతకాన్ని ఫోర్జరీ చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని డోర్నకల్ సీఎస్ఐ బిషప్ కోడిరెక్క పద్మారావు ఆరోపించారు. మంగళవారం డోర్నకల్ బిషప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం,మహమ్మదాపురం రెవెన్యూ పరిధిలోని భూములను 1903లో లార్డ్ బిషప్ పేరిట అప్పటి నిజాం రిజిస్ట్రేషన్ చేయించారని చెప్పారు. అట్టి భూమిలో సర్వే నెంబర్ 141,142,143లోని నాలుగు ఎకరాలను తన పేరుతో నకిలీనిరంభ్యంతర పత్రాలు సృష్టించారని చెప్పారు. ఈక్రమంలో మరిపెడ మండలానికి చెందిన కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు బిషప్ పద్మారావు తెలిపారు. కొందరు వ్యక్తులు తనను, కరీంనగర్ బిషప్ మార్క్ రూబెన్‌ను ఈ విషయంలో అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరికి పాము కాటు

బాలుడి పరిస్థితి విషమం

కరకగూడెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మాపురం పంచాయతీ పద్మాపురం గ్రామానికి చెందిన ఊకె సారయ్య, నాగమణి దంపతుల 18 నెలల బాలుడు విక్రమ్ ఆదిత్యను పాముకాటు వేసింది. సంఘటన కరకగూడెం మండలంలో మంగళవారం జరిగింది. విక్రమ్ ఆదిత్య ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో పాముకాటు వేయడంతో నోటి నుంచి నురుగు వచ్చింది. కింద పడి కొట్టుకుంటుండగా కుటుంబ సభ్యులు గమనించారు. భద్రాచలం వైద్యశాలకు తరలించారు. కరకగూడెం మండల కేంద్రంలోని ఎస్టీ వాడకు చెందిన నాలి సమ్మక్క పొలం పనులు చేస్తుండగా, పాములు బయటకు వచ్చాయి. గమనించిన సమ్మక్క పక్కన ఉన్న తన మామతో చెప్పడంతో ఒక పామును కొట్టి చంపాడు. అక్కడే ఉన్న మరో నూనె కట్ల పాము సమ్మక్క కాలను కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు సమ్మక్కను కరకగూడెం వైద్యశాలకు తరలించారు.



బాబాకు భస్మాభిషేకం



ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఈనెల10న గురుపౌర్ణమి సందర్భంగా మంగళవారం జిల్లాలోని షిరిడీ సాయిబాబా ఆలయాలలో వేడుకలు నిర్వహించారు. నగరంలోని రంగనాయకుల గుట్ట శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఉదయం బాబాకు భస్మంతో అభిషేకం, లక్ష్మీగణపతి హోమం, మన్యసూక్త హోమం నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గాంధీచౌక్ షిరిడీ సాయిబాబా ఆలయం, కవిరాజ్ నగర్, ప్రశాంతి నగర్, వీడీయోస్ కాలనీ, తదితర ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకుల ఘనంగా నిర్వహిస్తున్నారు.

అభివృద్ధి పనుల పేరుతో ఇసుక దందా

- భారీగా నిల్వ చేస్తూ అమ్మకాలు
- ఒక్కో ట్రక్కు ఇసుకను రూ.5వేల నుంచి రూ.6వేలు
- తిరుమలాయపాలెంలో పట్టించుకోని అధికారులు





పాలేరు నదిలో ఇసుక అక్రమతవ్వకాల దృశ్యం, ముజాహిద్‌పురంలో అక్రమంగా నిలవ ఉంచిన ఇసుక

తిరుమలాయపాలెం, జూలై5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పేరుతో ఇసుక దందా నడుస్తోంది. దీన్ని నియంత్రించాల్సిన అదికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలంలో ఆకేరు, పాలేరు నదులు ప్రవహిస్తున్నాయి. ఇక్కడ భారీగా ఇసుక నిలవలు ఉన్నాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని ఇసుక వ్యాపారులు దర్జాగా దందా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళకల పేరుతో దర్జాగా ఇసుక వ్యాపారం చేస్తూ లక్షలాదిరూపాయలు దండుకుంటున్నారు. కాకరవాయి, ముజాహిద్‌పురం, హైదరసాయిపేట, పడమటితండా, రావిచెట్టుతండా, పిండిప్రోలు, రమణతండా తదితర గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఒక్కోట్రక్కు ఇసుకను రూ.5నుంచి రూ.6వేలు అమ్ముతున్నారు. పట్టపగలే జోరుగా ఇసుక తరలిస్తున్నారు. అయినా నియంత్రించాల్సిన రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు పట్టించుకున్నా దాఖలాలు లేవు. అయితే ట్రాక్టర్ల యజమానులకు డ్రైవర్లకు కూడా లైసెన్సులుకానీ, ట్రాక్టర్లకు ఎలాంటి ధృవీకరణపత్రాలు కొన్ని గ్రామాల్లో లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహించాలనేదానిపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

భారీగా అక్రమ నిలవలు

మండలంలోని కాకరవాయి, ఏనుకుంటతండా, సుద్ద వాగుతండా, రావిచెట్టుతండా, హైదరసాయిపేట, పిండిప్రోలు, రమణతండా, పడమటితండా తదితర గ్రామాల్లో ఇసుక వ్యాపారులు పెద్దమొత్తంలో లక్షలాదిరూపాయల విలువైన ఇసుకను అక్రమంగా నిలవ ఉంచారు. ఆకేరు, పాలేరు నదుల్లో ఉచితంగా తీసుకువచ్చి నిలవచేసి దర్జాగా వేలాది రూపాయలకు అమ్ముతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



ఖమ్మంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక మంగళవారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఏదులాపురం మునిపాలిటి పరిధిలోని పెద్దతండా గ్రామానికి చెందిన ధారవత్ రాంమూర్తి నాయక్‌ను, ప్రధాన కార్యదర్శిగా తేజావత్ శివాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు రాంమూర్తి నాయక్ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కమిటీకి సంబందించిన నియామక పత్రాన్ని రాష్ట్రఅధ్యక్షుడు సపావట్ రాములు నాయక్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బానోతు తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

మంత్రి అడ్లూరిని కలిసి విన్నవించిన పీసీసీ సభ్యుడు జావేద్



మంత్రికి వినతిపత్రంలో వివరిస్తున్న జావేద్

ఖమ్మంసంక్షేమవిభాగం,జూలై8(ఆంధ్రజ్యోతి): మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దు ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని మైనార్టీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పీసీసీ సభ్యుడు ఎండీ జావేద్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన జావేద్ మైనార్టీల సమస్యలపై వినతిపత్రం అందించారు. విదేశాల్లో విద్యాభ్యాసం చేసే మైనార్టీ విద్యార్థులకు ఓవర్సీస్ పథకం అమలు చేయాలని కోరారు. నాయకులు అబ్దుల్ హఫీజ్, బషీర్, సమీర, సుల్తానా, అన్వర్, ఫాతిమా, నిషా, సభా, అస్మాత, ఫహిమిదాబేగం, ఆఫ్మదీబేగం పాల్గొన్నారు.

ఘనంగా రంగారావు పుట్టిన రోజు వేడుకలు



రంగారావును సన్మానిస్తున్న కార్పొరేటర్లు శరత్, కమర్తపు

ఖమ్మంసంక్షేమ విభాగం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం రాష్ట్రనాయకుడు శెట్టి రంగారావు పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో సంఘం నాయకులు జరిపారు. కార్పొరేటర్లు రాపర్తిశరత్‌కుమార్, కమర్తపు మురళీ కేక్ కట్ చేసి రంగారావుకు తినిపించారు. నాయకులు పొదిల రవికుమార్, పసుపులేటి దేవేందర్, కనిశెట్టి నర్సయ్య, శ్రీనివాసరావు, అనంతుల నర్సింహరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు

నేలకొండపల్లి,జూలై8(ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం నేలకొండపల్లి వైఎస్సార్ సెంటర్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, బొడ్డు బొందయ్య, వెన్నపూసల సీతారాములు, రేగూరి హనుమంతరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, దోసపాటి చంద్రశేఖర్, కుక్కల హనుమంతరావు, గెల్లా జగన్మోహన్‌రావు, మామిడి వెంకన్న, రేగూరి వాసవి, రాయపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు శిక్షణ తరగతులు

ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు విధి నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు వివరించారు. టీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరాం ఆధ్వర్యంలో డ్రైవర్లకు శిక్షణ తరగతులు మంగళవారం నగరంలోని నూతన బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏసీపీ, బ్రహ్మకుమారీస్ సిస్టర్స్ నుంచి గీత హాజరై మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో మద్యపానం తీసుకోకుడదని వివరించారు. మానసిక ఒత్తిడులను ఎలా అధిగమించాలో వివరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ మల్లయ్య, డిపో మేనేజర్ దినేష్‌కుమార్,మణుగురు డిపోమేనేజర్ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

యమునకు ట్రిబుల్ ఐటీలో సీటు



విద్యార్థినికి నగదు అందిస్తున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివిన 548 మార్కులు సాధించిన దార. యమున బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం విద్యార్థిని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు దాత మలిశెట్టి. వెంకటేశ్వర్లు రూ. 10వేల నగదు సహాయాన్ని విద్యార్థికి అందించారు.

ఈవోపై దాడి సరికాదు

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై8 (ఆంధ్రజ్యోతి): విధా నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం పురుషోత్తమపట్నంలోని భద్రాచలం రామాలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలిగించేందుకు వెళ్లిన ఈవోపై స్థానిక ఆక్రమణదారులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, అర్చక ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఈవోపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించి వారిపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం, కార్యనిర్వాహణ అధికారులు, నిర్వాహణ అధికారులు, అర్చక ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈవో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై 8(ఆంధ్రజ్యోతి): నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ స్టీరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని యుటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన స్టీరింగ్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

జిల్లా కన్వీనర్ నంద్యాల నరసింహరావు





వీరబ్రహ్మం, సైదులు

ఖమ్మంరూరల్, జూలై8 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని జిల్లాకన్వీనర్ నంద్యాల నరసింహరావు ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో నాయీబ్రాహ్మణుల పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక ప్యాకేజీ కింద సంక్షేమ పథకాలు, ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రూరల్ మండలం, ఏదులాపురం మునిపాలిటి కమిటీలను మంగళవారం ఎన్నుకున్నారు. ఖమ్మం రూరల్ మండలాధ్యక్షుడిగా నంద్యాల వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా గుడిమల్ల వెంకటనారాయణ, ఏదులాపురం అధ్యక్షుడిగా నంద్యాల నాగేశ్వరరావు, కార్యదర్శిగా మాదారపు సైదులు, గౌరవఅధ్యక్షుడిగా సురబి వెంకన్న, ఉపాధ్యక్షుడిగా దర్గయ్య, నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు వైరా పట్టణ అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్లు, పట్టణ గౌరవ అధ్యక్షుడు సురబి సైదులు, సహాయ కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగాలి

- రాష్ట్ర మహిళా సమైక్య అధ్యక్షురాలు సృజన



మాట్లాడుతున్న సృజన

ఖమ్మంరూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్నేల సృజన పిలుపునిచ్చారు. ఏదులాపురం మునిపాలిటీ పరిధిలోని ఏదులాపురం గ్రామంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో మంగళవారం 5వ మండలం మహిళా సమాఖ్య మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు బీజేపీ కుల, మతాల మధ్య చిచ్చు రాజేస్తూ అంట కాగుతూ ప్రజల మధ్య వైశ్యామ్యాలు రెచ్చగొడుతోందన్నారు. మహిళలను వంటగదికే పరిమితం చేసేలా తమ పెట్టుబడి దారి వ్యవస్థ ద్వారా టీవీ సీరియల్స్, ఫోన్లు వంటి వాటిని ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఇటువంటి శక్తులపై మహిళలు గళ మెత్తాలన్నారు. మహిళలు ప్రపంచంలోని పలు దేశాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తు చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకురాలు దండి నారాయణమ్మ, జిల్లా అధ్యక్షరాలు పోటు కళావతి, జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహిళా సంఘ జిల్లా ఇన్చార్జ్ జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగు నరసింహరావు, రాష్ట్ర సమితి సభ్యులు కర్ణకుమార్, మండలాధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ప్రత్యేకం.. సీత్లా భవానీ పండుగ







సీత్లా పండుగలో మేయర్ నీరజ, కార్పొరేటర్లు, శివాయిగూడెంలో సీత్లా వేడుకల్లో గిరిజనులు, ఇస్లావత్ తండాలో వేడుకలు

ఖమ్మంకార్పొరేషన్,జూలై8(ఆంధ్రజ్యోతి): గిరిజనులు జరుపుకునే సీత్లా భవాని పండుగ ప్రత్యేకమైనదని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సీత్లా భవాని పండుగ సందర్భంగా 8వ డివిజన్‌లో కార్పొరేటర్‌లు లకావత్ సైదులనాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లుతో కలిసి మేయర్ గోపాలపురంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. గిరిజనులతో పాటుగా ర్యాలీ పాల్గొన్నారు. 32వడివిజన్‌లో మేయర్ అందించిన నిధులతో నిర్మాణం చేసిన దేవాలయంలో స్థానిక కార్పొరేటర్ జీన్‌వన్ సరస్వతితో కలిసి పూజలు నిర్వహించారు.

రఘునాథపాలెం: గిరిజనుల సంప్రదాయ పండుగ సీత్లా భవాని వేడుకలను మంగళవారం రఘునాథపాలెం మండల వ్యాప్తంగా మేళ తాళాలతో నిర్వహించారు. తండాల నుంచి ఊరి బయటకు వచ్చి సామూహికంగా జరిపారు.

డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తండి: ఏడీఏ



మాట్లాడుతున్న ఏడీఏ సరిత, ఎంఏఓ రాధ, సిబ్బంది

నేలకొండపల్లి,జూలై8(ఆంధ్రజ్యోతి): డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలను వెదచల్లటం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలున్నాయని కూసుమంచి ఏడీఏ సరిత చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం సింగారెడ్డిపాలెం, బోదులబండ గ్రామాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది రైతులతో సమావేశాలు నిర్వహించారు. నారుమళ్లు పోసి, నాట్లు వేయటం ద్వారా ఉన్న కూలీల కొరతను డ్రమ్ సీడర్ పద్ధతిలో అధిగమించవచ్చన్నారు. పెట్టుబడి తగ్గుతుందని, పంటకాలం సైతం తగ్గుతుందని, రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వల్ల ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం విత్తన, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసారు. కార్యక్రమంలో ఎంఏఓ ఎం.రాధ, ఏఈఓలు అవినాష్, అరవింద్, శిరీష, రైతులు తాటికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూడలిలో గుంతకు మరమ్మతులు





ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నగరంలోని అల్లీపురం రోడ్డులోని మూడురోడ్ల జంక్షన్‌లో రోడ్డు కోతకు గురైంది. పెద్ద గుంత ఏర్పడి ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు నరక యాతపడుతున్నారు. విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈనెల 6న ప్రచురితమవటంతో అధికారులు స్పందించారు. కోతకు గురైన రోడ్డుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్-ఖమ్మం

త్వరలో పీడీపీఎస్ విధానం

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు



మాట్లాడుతున్న చిన్ని కృష్ణారావు

ఖమ్మంగాంధీచౌక్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో త్వరలో క్రయ విక్రయాల్లో ప్రైస్ డిఫిడిన్సి పేమెంట్‌స్కీం(పీడీపీఎస్) విధానం అమలు చేయనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్నికృష్ణారావు తెలిపారు. మంగళవారం చాంబర్‌ఆఫ్ కామర్స్ కార్యాలయ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈవిధానాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్,వరంగల్ జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్లలో అమలు చేయుచున్నట్లు తెలిపారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కూడా అమలు చేయాలని ఈ విధానం వల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు జరగవని, వ్యాపారస్తులకు కూడా లాభదాయకమన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో చిన్న సన్న కారు రైతులు అమ్ముకోవడానికి అనువుగా ఉంటుందని దీనిని రాష్ట్ర అసోసియేషన్ కూడా స్వాగతించిందని చెప్పారు. త్వరలోనే వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి ఇట్టి విషయాన్ని తెలియజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య, కోశాధ్యక్షులడు తల్లాడ రమేష్, దిగుమతి శాఖ అధ్యక్షుడు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కార్యదర్శి ముత్యం ఉప్పల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు యువజన నాయకుడు నంబూరి రాజీనామా

నేలకొండపల్లి,జూలై8(ఆంధ్రజ్యోతి):మండల యువజన కాంగ్రెస్ నాయకుడు, రాయగూడెం గ్రామానికి చెందిన నంబూరి నరేష్ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పార్టీని నమ్ముకుని పని చేస్తున్న తన లాంటివాళ్లకు పార్టీలో విలువ లేదని చెప్పారు.గ్రామంలో కొంతమంది స్వార్థంతో పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నప్పటికీ నాయకులు అటువంటివారికే మద్దతివ్వటంఆవేదన కలిగిస్తుందన్నారు. రెండ్రోజుల క్రితమే రాజేశ్వరపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దండా సత్యనారాయణ సైతం రాజీనామా చేశారు.

నాయీ బ్రాహ్మణుల మండల కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం, జూలై8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మాయిగూడెంలో సంఘం మండల కమిటీ సమావేశంలో నాయీబ్రాహ్మణుల మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా ఆలేటి సాయికుమార్, కార్యదర్శిగా గుండ్లపల్లి యాకయ్య, ఉపాధ్యక్షుడిగా జంపాల రవి, కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా పిల్లలమర్రి సైదులు ఎన్నుకున్నారు.

ప్రతీ నిరుపేద విద్యార్థికి సంక్షేమ వసతి కల్పించాలి

- సాంఘిక సంక్షేమశాఖ డీడీ కస్తాల
- సంక్షేమాధికారులతో సమావేశం



ఖమ్మంసంక్షేమవిభాగం, జూలై8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ నిరుపేద ఎస్సీ విద్యార్థికి వసతిగృహ సీట్లు అందుబాటులో ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో వసతిగృహా సంక్షేమాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం కల్పించిన కార్పొరేట్ సౌకర్యాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. నూతన అడ్మిషన్లు పెంచాలని, ఇప్పటికే జాయిన్ అయిన విద్యార్థుల వివరాలను ఈనెల 15లోగా ఆన్‌లైన్ నమోదు జరపాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అన్ని వసతిగృహాల్లో క్రమ పద్ధతిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రత్యేకంగా చిక్‌రూమ్, అందుబాటులో మందులు ఏర్పాటు చేయాలన్నారు. పేరంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యార్థుల సౌకర్యాలు పంపిణీపై సంక్షేమాధికారుల వారీగా సమీక్షించారు. పారదర్శకంగా విద్యార్థులు ఆన్‌లైన్ హాజరు నమోదు జరపాలని ఆదేశించారు. ఒక హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పరిమితికి మించిన తర్వాత ఇంకా వస్తే మరో హాస్టల్‌కు పంపాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు సంక్షేమ వసతిగృహాల నిర్వాహణ చేపట్టాలని సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల ఆదేశించారు. ఏఎస్‌డబ్ల్యూవోలు, తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కొటపాటి రుక్మారావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మట్టి అనుమతివ్వాలి

కొణిజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలు ఇళ్ల కట్టుకోవడానికి మట్టికావలసి ఉంటుంది, పేదలు తెచ్చుకుంటున్న మట్టికి మట్టి మాఫియా అడ్డుపడుతోందని, పలువురు అధికారులు కూడా ఆ మాఫియాకే సహకరిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు విమర్శించారు. మంగళవారం సీపీఐ కార్యాయలంలో విలేరులతో ఆయన మాట్లాడారు.మండల వ్యాప్తంగా మట్టి మాఫియాదే ఇష్టారాజ్యంగా మారిందని, నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించి పేదప్రజలు ఇండ్లకు మట్టి తెచ్చుకునే అవకాశం ఇప్పించాలని కోరారు. మండల సహాయ కార్యదర్శులు స్వర్ణ రమేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న, సీతరాములు పాల్గొన్నారు.

మరుగున పడిన మహానీయుల విగ్రహాలు

» రెండేళ్లు గడిచినా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నవత రానికి మార్గదర్శకంగా నిలిచిన మహానీయుల విగ్రహాలు ఓ ప్రభుత్వ విద్యాసంస్థలో ధ్వంసమై రేండేళ్ల గడిచాయి. విగ్రహాల రూపురేఖలు పూర్తిగా మారిపోయిన వాటి గురించి విద్యాశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోని పరిస్థితి. ఇలా మండలంలోని చంద్రుపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పూర్తిదాయకంగా ఉండేలా ఆ గ్రామంలోని పలువురు దాతలు ముందుకు వచ్చి 2017 జనవరి 10 తేదిన జాతిపిత మహాత్మా గాంధీ, సరస్వతిదేవి, తెలుగు తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయించారు. సదరు విగ్రహాలకు దాతలు రూ.3 లక్షలు వితరణ కూడ చేశారు. కాల క్రమంలో మహానీయల విగ్రహాలు ధ్వంసమైనాయి. వాటిలో జాతిపిత గాంధీ విగ్రహాన్ని పరిశీలిస్తే కుడి చేయ్యితోపాటుగా చేతిలో ఉండాల్సిన కర్ర లేకుండా నామరూపం కరువైంది. అలాగే సరస్వతిదేవి విగ్రహాన్ని గమనిస్తే రెండు చేతులు విరిగిన ట్లుగా కనిసిపిస్తోంది. ఇక తెలుగు తల్లి విగ్రహం పరిస్థితి కూడా అంతే చేతిలో ఉండాల్సిన తామర పువ్వు రూపం లేకుండా ఉంది. ఆయా విగ్రహాలు చంద్రుపట్ల పాఠశాల ప్రాంగణంలో తరగతి గదులకు, స్టాఫ్ రూంకు అనుసంధానంగా ఉన్నాయి, పైగా దాతలు సదరు విగ్రహాలను ఏర్పాటు చేసినప్పట్ట నుంచి నేటి వరకు పాఠశాలలో పని చేస్తున సీనియర్ ఉపాధ్యాయులు కూడా పట్టించుకోకపోవడం వారు ఈ విగ్రహాలను ఏ విధంగా విస్మరించారో తెలుస్తోంది. పాఠశాలలో ఏర్పాటు చేసే విగ్రహాలకు గ్రిల్స్ ఏర్పాటు చేస్తే అవి రక్షణ కవచంలా ఉండేవి. అందుకు భిన్నంగా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు స్థానికంగా దాతలు ముందుకు వచ్చే ఆవకాశం ఉన్న వారు స్పందిచిన పరిస్తితి, విద్యాశాఖ తరుపున సదరు పాఠశాల హెచ్ఎం లేదా ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ వహించక పోవటంతో మహానీయుల విగ్రహాలకు ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పటికైన నేటి విద్యార్థులకు, సమాజానికి ఆదర్శంగా, స్పూర్తిదాయకంగా ఉండాల్సిన ఈ మహానీయుల విగ్రాహాలకు తగిన మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఎంతైన ఉందిని చెప్పవచ్చు. ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారిణి పి.నివేదితను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాము ఆ పాఠశాల హెచ్ఎం దృష్టికి తీసుకోవెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.



చంద్రుపట్ల ఉన్నత పాఠశాలలో ధ్వంసమైన మహానీయుల విగ్రహాలు

విద్యతో గొప్పస్థాయికి చేరుకోవచ్చు

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని, విద్యతోనే గొప్పస్థాయికి చేరుకోవచ్చునని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సత్తుపల్లి పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. సమయానికి సిలబస్ పూర్తి చేయాలని, దోమలు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ తరచూ మెడికల్ క్యాంపులను నిర్వహించాలని ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్యను ఆదేశించారు.

పెనుబల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల గ్రామంలోని మహాత్మాజ్యోతిరావ్‌పూలే, సాంఘీక సంక్షేమ పాఠశాలలను మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. మండలంలోని కుప్పెన కుంట్ల గ్రామంలోని సాంఘీక సంక్షేమశాఖ పాఠశాల(సత్తుపల్లి)ని, మహాత్మాజ్యోతిరావ్‌పూలే బాలుర పాఠశాల(కుంచపర్తి), మహాత్మాజ్యోతిరావ్‌పూలే బాలుర పాఠశాలలను(లంకపల్లి) ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధనను విద్యార్థులతోపాటు కూర్చొని పాఠాలను విన్నారు. విద్యార్థులకు బోధన ఎలా జరుగుతుందని, హాస్టల్‌లో భోజనం, వసతులు ఉన్నాయా, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూ మంచిగా చదువుకొని విద్య ద్వారా జీవితంలో మార్పులు సాధించి గొప్పస్థాయికి చేరుకోవాలన్నారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆయన వెంట పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సత్తుపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

ఏన్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్గ విబేధాలు మాని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు కృషిచేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. స్థానిక రైతు వేదికలో మంగళవారం జాతీయ ఆహార భద్రత మిషన్ కింద 20మంది రైతులకు కందులు, మినప సంచులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వం అందించిన విత్తనాలను సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం వై.ఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఏవో నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు మేడా ధర్మారావు, లచ్చిరాంనాయక్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, చందమామ నరసింహారావు, మాలోతు నరసింహారావు, మాదినేని లెనిన్, పంతగాని నరేష్, యండ్రాతి సాయి పాల్గొన్నారు.



విత్తన సంచులను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే

వైరా, జూలై 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పని చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సోమవారం నుంచి చేపట్టిన స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశాల యాత్రను మంగళవారం వైరాలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం, మండల కేంద్రాల్లో పార్టీ కేడర్‌ను స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారని పేర్కొన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, వైరా, కొణిజర్ల, ఏన్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, వైరా నాయకులు బోళ్ల గంగారావు, వీరంశెట్టి సీతరాములు, పమ్మి అశోక్, పణితి శ్రీను, ధార్న రాజశేఖర్, తేళ్లూరి వీరయ్య, రంగా జనార్ధన్, పెద్దప్రోలు లక్ష్మయ్య, తోటకూర గోపి పాల్గొన్నారు.

మహిళలు కష్టపడి నిజాయితీగా నిలబడాలి

సత్తుపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ భూ ప్రపంచంలో మహిళలను మించిన శక్తి లేదని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగించుకుని మహిళలు ఎంచుకున్న రంగంలో కష్టపడి నిజాయితీగా నిలబడాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలను మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా వడ్డీలేని డ్వాక్రా రుణాలను అందించారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రుణాలను పొందిన వారు నచ్చిన విధంగా మార్కెట్‌కు అనుగుణంగా ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని ఎవరి కాళ్లమీద వారు నిలబడి వృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ముస్సిపల్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం

ఉద్యోగులు, కార్మికుల కష్టసుఖాల్లో తామెప్పుడూ తోడుగా ఉంటామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సత్తుపల్లి ముస్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వైఎస్ఆర్ అభిమాని ఎండీ.కమల్‌పాషా ఆధ్వర్యంలో ముస్సిపల్ కార్మికులకు ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలలో ఆమె పాల్గొన్నారు.



ఇందిరా మహిళా శక్తి సంబరాలలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్యాంబాబు, వరలక్ష్మి దంపతులు

వైరా, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఇద్దరు బాధిత కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకుడు ఉండ్రు శ్యాంబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని వైరాలోని మాటూరుపేట కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అంబడిపూడి నాగరాజు కుటుంబానికి రూ.పదివేలు అలాగే మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన యండ్రాతి మంగయ్యకు రూ.పదివేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంబాబు, వరలక్ష్మీ దంపతులతో కలిసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. అంతకముందు వైరాలోని గుట్టబడిలో రేపాల మదన్‌మోహన్ పుట్టినరోజు సందర్భంగా రూ.పదివేల విలువైన స్పోర్ట్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, వై.బుచ్చిరామారావు, చింతోజు నాగేశ్వరరావు, నూకల ప్రసాద్, పి.ఉపేంద్రరావు, మిట్టపల్లి సత్యంబాబు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

చింతకాని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శెట్టి మోహన్‌రావు సతీమణి అన్నపూర్ణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. మృతదేహాన్ని ఎమ్మెల్సీ తాత మధు, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, నాయకులు గుండ్లపల్లి శేషగిరి, పెంట్యాల పుల్లయ్య, గురిజాల హనుమంతరావు, బొడ్డు వెంకటరామారావు, రమేష్, రవీంద్రరెడ్డి, కుటుంబరావు, శ్రీనివాసరావు కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, తూము కోటేశ్వరరావులు సందర్శించి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మాజీ లోకసభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నపూర్ణమ్మ మృతిపట్ల సంతాపాన్ని తెలిపారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

ముదిగొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో వివిధ పనుల కోసం మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండి వినియోగంలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులునెదుర్కొంటున్నారు. రూ.లక్షలు వెచ్చించి మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటర్ సరఫరా నిర్వహణ లేకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. రోజూ వందలమంది ప్రజలు పలు పనుల కోసం కార్యాలయాలకు వస్తారు. కావున అధికారులు స్పందించి వీటి నిర్వహణ చర్యలకు ఆదేశించాలని కోరుతున్నారు

తల్లి పేరిట ఒక మొక్క నాటండి: నంబూరి

సత్తుపల్లి, జూలై8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం దేశ ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు అందరూ కలిసి 150కోట్ల మొక్కలను నాటించి ఇద్దామని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. తల్లి పేరుమీద ఒక మొక్క నాటండి అనే పిలుపులో భాగంగా మంగళవారం పట్టణంలోని 9వ వార్డులో మొక్క నాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో బాణోత్ విజయ్, సాలి శివకృష్ణ, శివ, నరేష్, ప్రసాద్, పాలకొల్లు శ్రీను, మేరుగు శేషగిరి, చీకటి వసంతరావు, ఈడా గణేష్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములైన సభ్యులకు సన్మానం

కారేపల్లి జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల ఐకేపి కార్యాలయంలో మంచి వర్కర్‌గా పనిచేస్తున్న పలువురు సభ్యులకు మంగళవారం కార్యాలయంలో అదనపు డీఆర్‌డీపీ జయశ్రీ, ఏపీఎం వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఘనంగా సన్మానించారు. వ్యాపారంలో రాణించిన కంచె నాగలక్ష్మీ, విద్యార్థులకు స్కూల్ యూనిఫాం కుట్టిన సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చేవిధంగా వ్యహరించిన బానోత్ చిన్ని, బెస్ట్ గ్రామ సంగం సంపంగి, బెస్ట్ వివోఏ సుజాత, మండల సమాఖ్య అకౌంటెంట్‌గా నాగలక్ష్మీ, కంప్యూటర్ ఆపరేటర్ సునిత, కార్యాలయ అటెండర్, స్వీపర్ వెంకటమ్మలను శాలువలతో సన్మానించి, మెమెంటో అందచేశారు.

ఘనంగా గిరిజనుల సీత్లా భవానీ పండుగ

మధిర రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం వంగవీడు గ్రామంలో మంగళవారం గిరిజనుల సీత్లా భవానీ పండగను ఘనంగా నిర్వహించారు. బంజారాల సాంస్కృతిక ఉత్సవం అయిన ఈ పండగను గిరిజనులంతా కలిసి గ్రామంలో ఐక్యంగా జరుపుకున్నారు. తండా పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రకృతి ఆధారంగా జీవనం సాగిస్తున్న బంజారాల సాంస్కృతిక చిహ్నంగా ప్రతి ఏటా ఇదేనెలలో ఈ పండుగను జరుపుకుంటుంటారు. తండా పెద్దలు, మహిళలు, యువతీయువకులు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీత్లా భవానీ పండగ వేడుకలను మండల వ్యాప్తంగా గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు, యువతీ, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.



పండుగ సందర్భంగా బోనమెత్తిన మహిళలు

కారేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గిరిజన తండాలలో గిరిజనుల సంప్రదాయ పండుగైన సీత్లా భవాని (దాటోడ)పండగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వర్షాలు కురిసి పంటలు పండాలని ప్రజలు కోరుకున్నారు.

మీ సేవా కేంద్రాల్లో ధరల పట్టిక ఏర్పాటు చేయాలి

మధిరటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని మీసేవాలలో ధరలను వినియోగదారునికి తెలిపేలా ధరల పట్టికను ఏర్పాటు చేసేలా చూడాలని మండల బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీహరి మంగళవారం మధిర తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. సామాన్యుడి దగ్గర మీసేవ నిర్వహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారని ప్రతి సేవకు ప్రజలు మీసేవలకు వెళ్లాల్సి ఉందని కావున ప్రతి మీసేవల వద్ద అందరికి ధరలు తెలిసేలా పట్టిక ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు సాయిబాబా ఆలయంలో కాగడ హారతి

కారేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి మహోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని బిక్యాతండాలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహక కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కొణిజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు అయిన సంఘటన మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పెరిక వెంకటేశ్వర్లు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారడంతో చెట్టు పై నుంచి కిందపడ్డాడు. వెన్నుపూస భాగానికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబసభ్యులు 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రి నుంచి హైదరాబాద్ తీసుకెళ్లారు.

కలెక్టర్ ఆదేశాలతో తరలివచ్చిన అధికార యంత్రాంగం

కొణిజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం ఎల్లన్ననగర్ గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌లో గ్రామసమస్యల మీద ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం జిల్లా అధికారయంత్రాంగం ఎల్లన్ననగర్ గ్రామాన్ని సందర్శించింది. విద్య, వైద్యం, రోడ్ల సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో సామినేని సత్యనారాయణ, సీఎంవో రాజశేఖర్, డీఎంహెచ్‌వో కళావతి బాయి, ఆర్‌టీసీ ఖమ్మం డీఎం తదితర అధికారులు గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో ఒకటి నుంచి ఐదవ తరగతి చదివే పిల్లలు 22 మంది ఉండడంతో గ్రామానికి తాత్కాలికంగా ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని మండల విద్యాశాఖాధికారి అబ్రహంను డీఈవో ఆదేశించారు. అలాగే ఏఎన్ఎంలు లేరని, బస్సు సౌకర్యంలేక ఇబ్బందులు పడుతున్నామని జిల్లా అధికారుల దృష్టికి స్థానికులు తెచ్చారు. ప్రజలందరికి వైద్యం అందేలా చూస్తామని డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. బస్సు సౌకర్యం గురించి కూడ ఆలోచన చేస్తామని డీఎం తెలిపారు. ప్రజావాణిలో ఫిర్యాదుతో జిల్లా యంత్రాంగం గ్రామానికి వచ్చినందుకు స్థానికులంతా కృతజ్ఞతలు తెలుపుతూ, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు మండల ఎంఈవో అబ్రహం ఉపాధ్యాయులు కరామత్‌అలీ, అచ్యుత్, సూర్యనారాయణ, సీఆర్‌పి సైదబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

ఓటర్ల జాబితాలో బీఎల్‌వోలే కీలకం

వైరా, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తమ పరిధిలో 18సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరిని బూతులెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో) ఓటర్లుగా నమోదు చేయాలని వైరా తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. వైరా ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం బీఎల్‌వోలకు ఓటర్ల చేర్పు, జాబితాల తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదులో చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

మధిరటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓటర్ జాబితా తయారులో బిఎల్‌ఓల పాత్ర చాలా కీలకమైనదని మధిర తహసీల్దార్ రాంబాబు అన్నారు. మంగళవారం మధిర లోని టివిఎం పాఠశాలలో జరిగిన బిఎల్‌ఓ లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లా భాగంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ..ప్రతి బిఎల్‌ఓకు 6, 6ఎ, 7, 8లపై అవగాహన కలిగి ఉండాలని బిఎల్‌ఓ యాప్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, సి విజిల్ యాప్ కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల డి.టి డేవిడ్ కరుణాకర్, ఆర్ఐ భానుప్రసాద్, ఎస్ఓ సాయి, ఎస్ఐ వాసు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరానికి హజరైన బీఎల్‌వోలు

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

ముదిగొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ హెచ్చరించారు. ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి భవనం నూతనంగా నిర్మాణం జరుగుతున్నప్పటికీ అక్కడే వినియోగించాల్సిన మట్టిని అక్రమంగా కొందరు తరలిస్తున్నారని తహసీల్దార్‌కు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని ఆర్ఐ వహీదా సుల్తానా పరిశీలించి మట్టి తరలింపును నిలిపివేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కారేపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేదప్రజల సమస్యల పరిష్కారమే సీపీఐ ప్రధాన ఎజెండా అని శత వసంతాలు జరుపుకుంటున్న ఎర్రజెండా స్పూర్తితో భవిష్యత్తు ఉద్యమాలు నిర్మంచుకోవాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కోనంనేని సాంబశివరావు పిలుపు నిచ్చారు. మండల 17వ మహాసభ మాధారం గ్రామంలో తెలంగాణ సాయుధరైతంగ పోరాట యోధుడు పాపినేని వెంకయ్య, కప్పెర వేదాద్రి ప్రాంగణంలో జరిగింది. ఈసందర్భంగా మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరైనా సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటి కరుణకు వ్యతిరేకంగా బుదవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. పార్టీ కార్యదర్శి భాగం హేమవంతరావు మాట్లాడుతూ.. హిందుత్వ ముసుగులో దేశం అభివృద్ధికి దూరం అవుతుందన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మీ, సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి ఈరు నాయక్, కొల్లి వీరయ్య, బట్టు సంగయ్య, తాతా వెంకటేశ్వర్లు, బొమ్మలకృష్ణ, ప్రేమ్‌చంద్, పోతనబోయిన రవి గోవింద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఘనంగా రాజశేఖర్ రెడ్డి జయంతి

మధిరటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు నరసింహారావు, తూమాటి నవీన్ రెడ్డి, దుంపా వెంకటేశ్వర రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరులో మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు మేడా ధర్మారావు, లచ్చిరాంనాయక్, భూక్యా చందులాల్‌నాయక్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, చందమామ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామంలో మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ చిన్నపుల్లయ్య, దానేలు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, రమేష్, కిషోర్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ధ్వంసమైన దారులు, పంటకాల్వలను పరిశీలించిన ఆర్డీవో

వైరా, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు మంగళవారం వైరా మండలంలోని గండగలపాడు గ్రామంలో పర్యటించి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ సమయంలో ధ్వంసమైన రహదారులు, పంటకాల్వలను పరిశీలించారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల తమకు ఎదురవుతున్న సమస్యల గురించి గండగలపాడు రైతులు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. అక్కడి విషయాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆర్డీవో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో గండగలపాడు వద్ద పంటకాల్వలు, దారి సమస్యలను పరిశీలించారు. సంబంధిత నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, గిర్దావర్ శ్రీకాంత్, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, బాధిత రైతులు పాల్గొన్నారు.

నానోయూరియా, డీఏపీ శ్రేయస్కరం



క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న డీఏవో పుల్లయ్య

వైరా, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ద్రవ రూపంలో ఉన్న నానోయూరియా, నానోడీఏపీ వాడకం వల్ల అనేక ప్రయోజనాలు సిద్ధిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య పేర్కొన్నారు. ద్రవరూపంలోని నానోయూరియా, నానోడీఏపీ వాడకంపై మంగళవారం వైరాలోని రైతువేదికలో జరిగిన సదస్సులో ఆయన అవగాహన కల్పించారు. ఆ తర్వాత క్షేత్రసందర్శన చేపట్టి ద్రవరూపంలో నానోయూరియా, డీఏపీ వాడకంపై డెమో నిర్వహించారు. అలాగే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. పామాయిల్ సాగును పెంచాలని సూచించారు. హార్టికల్చర్ అధికారి వేణు, మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్, ఏఈవోలు రాజేష్, వాసంతి, కీర్తి, రైతులు పాల్గొన్నారు.

తల్లాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో మంగళవారం సత్తుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నానో యూరియాపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. పంట విత్తిని నెలరోజుల తర్వాత నుంచి పంటకాలంలో 20,40 రోజుల తర్వాత నానోయూరియా స్ప్రే చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు ఈకార్యక్రమంలో ఏవో ఎండీ తాజుద్దీన్, ఏఈవో హసీనా, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

కొణిజర్ల,జూలై8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీగలబంజర గ్రామ పంచాయతీ శివారు రత్నాపురం, మంగాపురం గ్రామాలలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, షేక్ దాదాసాహెబ్ మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి ద్వారా కోరారు.